# భ్రమా – భామా

★ దామర్ల శ్రీరామకృష్ణ ★



ఒక్క మెరుపు మెరసినట్లుంది. ఉరుములు, వర్షం లేవు. కాని ఆ మెరుపు ఎక్కడనుండి! తెల్లగా తళుక్కుమంటూ అద్దంలో తన అందాన్ని చూసుకొంటున్న భానుడు కళ్ళు జిగేలుమనిపించే కాంతితో, 'ఫ్లాష్' కొట్టినట్లుగా, చిన్నారి కనుపాపలను వెలితల చేసేట్లుగా, — వుంది, ఆ మెరుపు.

రమణ ఒక్కసారి దిగ్భ్రాంతి జెంది తనువుని, తన తనువును మరచి, ఆ మెరపులో తనకున్న పరిచయం చేసుకొంటూ— అటే గురిపెట్టాడు.

అక్కడ మెరుపులేదు. వేయికాండిలు బల్బు కాదు. చండప్రచండుడైన సూర్యభగవానుని కీర్తిపుంజమూ గాదు! మరి! . . . వెండికిరణాలను విరజిమ్మే హిమోత్పర్వతపు వరుసలోని తెల్లని, చల్లని మంచు తునకా!! విలాసానికో, విహారానికో దివినుండి భువికి దిగిన ఏ దేవతో! లేక భువినుండి దివికి ఎగరాలని వింతవేషంతో, వయ్యారంతో, తీపివూహలతో, కలలతో, కులుకుతున్న, అణుశక్తియుగ అధునాతన—పూబోడి కాలేజీ!!

అంతా భ్రమలా వుంది! తనువున్నది కాలేజీ మూడో అంతస్తుమీద! అంచలు అంచలుగా వున్న అందమైన ఆ వరండామీద!!

లేతనీలపు అంబరాన్ని ధరించినట్లుగా దూరాన వున్న పయోధి, కదలక మెదలక నిశ్చలంగా — అంతులేని నీలి ఎడారిలా వుంది! ఆ నీలిరంగు ఎడారిలో వున్నగా, కారునలుపు పొగ విరజిమ్ముతూ కొంటూ బరువుగా నడుస్తున్న 'నావ', అక్కడ చిన్న చీమలా కనిపిస్తుంది! కాలేజి 'ప్లాక్ టవర్' శతాబ్దంలో కనుపించని శిల్పులతో తల ఎత్తుతున్న వీరుడులా వుంది!!!

కాని తళుక్కుమనే ఆ మెరుపుతీగమీద మాత్రం దృష్టి మారలేదు! ఎవరు 'దేవత'! తను ఇన్నాళ్ళ నుండి ఇక్కడ చదువుతున్నాడు! మరి ఆ 'నవ్వు' ముఖం, సరికొత్త తళుకు బెళుకు — ఎవరో అని అతని సమస్య! ఆ సమస్యను ఛేదించే సావకాశం తనకిప్పుడులేదు. ఇంకా కొన్నిక్షణాలలో ఒక గొప్పవిషయం జరుగపోతుంది. తను ఎన్నికలలో పోటీవేసాడు! తనను విజయం వరిస్తుందో శనిదేవత లాలిస్తుందో! తనది మెత్తని మనస్సు! తన భావాలు గులాబిరేకులకంటే, సాలెగూడు తీగలకంటే సున్నితం! తను విజయం పొందితే ఎలావుంటుందో చెప్పలేడుగాని — అపజయం పొందితే ఎంత బాధపొందుతాడో మాత్రం వూహించగలడు. . . .

అంత అమాంతంగా ఓ అమ్మాయి, సన్నగా, సన్నజాజిలావున్న ఓ అమ్మాయి, హాయిగా ఆకర్షించింది! అల్లంత దూరాన వాకిట్లోనుండి తలత్రిప్పుతూ, ఒక్కొక్క చూపు చూస్తుంటే, పుట్టలోవున్న నాగుపాము శిరస్సుమీద మెరిసే నాగమణిలా జయుటను తొంగిచూస్తున్నట్లుంది. దేవేంద్ర సభలో, సింహద్వారము దగ్గర నిలుచున్న దేవకన్యలా, వాకిలుకే, ఆ వరండాకే అందం తెచ్చింది! — ఆ అమ్మాయి. . .

హఠాత్తుగా రమణను కదిలించింది భద్రయ్య అరుపు. "హల్లో బ్రదర్! కంగ్రాచ్యులేషన్సు! ఏభై ఓట్ల మెజారిటీ!" — అంటూ దీర్ఘాలు తీస్తూ రొప్పుతూ గట్టిగా కావిలించుకొన్న భద్రయ్యను రమణ ఒక్కసారి పైకెత్తి ముద్దు పెట్టుకునేంత పనిచేసాడు. రమణకు అంతా అయోమయంగా వుంది. సర్వం మరచిపోయాడు. ఎంతోమంది తనచుట్టూ చేరారు. "కంగ్రాచ్యులేషన్సు" అని కొంతమంది! చేతులు లాగేవారు యింకా కొంతమంది. వీపు మీద చరిచేవారు, జుట్టుపీకేవారు, చొక్కా వూపేవారు! అబ్బ! ఎంత గందరగోళం. అందరకూ ఉత్సాహమే! చివరకు రమణను పైకెత్తి దిక్కులు పిక్కటిల్లేట్లు అరుస్తుంటే, తెల్లని గోడలు ప్రతిధ్వనిస్తున్నాయి. అంతా కోలాహలం! రమణ—తను ఎవర్ని చూస్తున్నాడో తెలియటంలేదు! ఎవరినని చూస్తాడు? ఒకరా, యిద్దరా,! అన్నీ తలలే! ఒకరి తర్వాత ఒకరు 'షేక్‌హ్యాండ్సు' యిస్తూ, వస్తూపోతున్నారు.

రమణ అప్రయత్నంగా, యాంత్రికంగానే అందరకూ జవాబు చెబుతూ, ప్రతి నమస్కారం చేస్తూ అదోరకం మూడ్‌లో వున్నాడు.

ఇప్పుడు అతి ముఖ్యస్నేహితులు వచ్చారు. క్లాసుమేట్సు — రావు, రంగనాథం, మూర్తి, వెంకట్లు, స్వామి — కాంతం, కుమారి, జలజ. . యింకా యింకా . . . ఎందరిని తను పేర్లు గుర్తుంచుకొంటాడు — . .. వాళ్ళువచ్చి అభినందించి పోయారు.

"నేను అదృష్టవంతుణ్ణి. . ." సగర్వంగా పిలయ్యేడు రమణ. కానీ! ఆ మెరుపు తీగె — తెల్లని సన్నజాజి — తనవద్దకొస్తే ఎంత బాగుండును. తనకు 'కంగ్రాచ్యులేషన్సు' చెబుతుందేమో! అవును తనవేపే చూస్తుంది. మాట్లాడే కళ్ళు, లేతనవ్వు పెదాలు, నృత్యభంగిమల్లోవున్న శిరోజాలు, సన్నగా, గులాబిలావున్న శరీరం— నిజంగా అంత అందమైనవారు వుంటారా — అనే భ్రమ రమణకు కలిగింది!

తను ఎంతో పుణ్యం చేసుకొన్నాడు! ఆమె తనను ఆకర్షిస్తుంది. తనూ ఆమెను ఆకర్షిస్తుండాలి. ఆ చల్లని వలయపు చూపు, ఆ చూపులో వింత సందేశం. ఆ సందేశంలో మాధుర్యం తనకు గోచరిస్తున్నాయి.

ఆమె వస్తుంది! తనవేపే! అవును తనవేపే! బంగారు పూతలతో వేయి కాంతులు విరజిల్లే నాగకన్యలా, గాలికి రెపరెపలాడే మొగలిరేఖలా, కాళ్ళు అరుగుతాయో, అన్న సంశయం వేసే మృదువైన అడుగులతో —. . . ఆమె, తనవేపు వస్తుందని గ్రహించిన రమణ తన రెండుకళ్లను నమ్మలేనట్లుగా పెద్దవి చేసాడు.

"కంగ్రాచ్యులేషన్సు. . ." సప్తస్వరాలతో, సంగీత మాధుర్యంతో—ఆ పలుకులు రమణ చెవుల్లో గింగురుమన్నాయి.

"థ్యాంక్స్" రమణ నాలుక కరచుకొన్నాడు! ఇంకా చాలాసేపు మాట్లాడితే ఎంతబావుండును.

"అసలు మీకు ఓటు వేయలేదు! తెలుసునా.." అంది, ఆమె! ఆ భావప్రకటనలో అంతర్యం రమణకు తెలియలేదు.

"ఐనా నేను గెలిచాను. . .' అన్నాడు.

తనకు 'షేక్‌హ్యాండ్' యిస్తుందేమోనని చేయిచాసాడు! చేతులు ముడుచుకొని 'నమస్తే' అంటూ ఆమెపోయింది.

పోయింది. మాయమయింది! ఒక్కనిమిషం పాటు రమణ అనే ప్రపంచాన్ని మొత్తం ఉర్రూతలూగించిన—ఒక వెలుగు, కాంతి, జ్యోతి—పోయింది. ఒకప్రక్క సూర్యుడస్తమిస్తుంటే, వేరొక్కప్రక్క ఒంటరి తనాన్ని అనుభవించే కొండలు కొలనులు, చెట్లు, చేమలు దీనముఖాలతో విచారిస్తుంటాయట, మరి ఎప్పటికో "పద్మమిత్రుని దర్శనమని. అలాగే రమణ ముఖం దీనావస్థలో వుంది!

విజయలక్ష్మిని చేపట్టి విజయగర్వంలోవున్న రమణ ప్రేమ రాగానికి తాళంవేయవలసి వచ్చింది. ఆ 'సన్నని సన్నజాజిని' ప్రేమిస్తే! ఐనా ప్రేమ యాంత్రికంగా పుడుతుందా ఎక్కడైనా! దానికి సహజ జన్మవుంది! హృదయప్రవాహ ప్రవాహంలో, జలధార్లలో చిందులు త్రొక్కుతుంది! అక్కడ వుండే తీపి సముద్రంమీద నౌకా విహారం చేస్తుంది! ఆ జలధార్లలో మొలిచే మొక్కలు, చిగురు టాకులను, పుష్పఫలాలను, ధరించి, భరిస్తాయి. అంచేతనే ఎన్నడూలేని అనుభూతి వూహకందని విచిత్ర పరిస్థితి, రమణలో కలిగింది ప్రేమించటమంటే తేలికపనా! వూహా ప్రపంచంలో ప్రేమ విహారం చేయటం సులభమే!. . . గులాబి సౌందర్యం, పడమటిగాలి, రంగుతుమ్మెద చుక్కల చక్కదనమూ, అన్నీ ఆనందాయకమే, భావాప్రపంచం సంబంధించి నంతవరకు ప్రేమిస్తున్నాననే నమ్మకం ఒకటి కలగాలి! ఆ నమ్మకం, నిజాయితీ, వాస్తవాలకు ఎంత దగ్గరగా వుంటుందోకూడా అవసరం!

రమణ ఒంటరితనంలో ప్రేయసి గుర్తుకొస్తే వుండే వుత్సాహం, బాధ నిజంగా ఫీలయ్యేవాడు! ఒంటరి తామరను, పున్నమి చంద్రుని, సముద్రపు అలను, లోతులోయను, చూసినపుడు వుండే 'ఫీలింగ్' మరీ ఎక్కువగా వుంది! హృదయంలో ఉద్రేకం ఉబికినప్పుడు—తను ఆమెతో మాట్లాడాలి—ఆ ప్రేమసందేశం అందచేయాలి అని అనుకొన్నాడు! కాని వెంటనే భయం ఆవరిస్తుంది! తన సందేశాన్ని నిష్కర్షగా ఆమె తిరస్కరిస్తే. . .తనెంతో మథనపడతాడు. సున్నితమైన తన హృదయ కోశానికి చిల్లులు పడతాయి! మామిడి పండు అందని చిన్నపిల్లాడులా బెంగపెట్టుకుంటాడేమో రమణ యింకా విచారిస్తూనే వున్నాడు. తర్కిస్తూన్నాడు. తను మరచిపోలేదు. అంత చక్కని అమ్మాయి ఆ వంకుల జుత్తులోనే అందంవుంది. చూపు, నడకలీవి, తను మరువలేడు! ఇంతకీ తనేనా బాధపడేది! ఆమెకూడా తనను గూర్చి విచారిస్తుందో, లేదో! తను ప్రేమిస్తున్నట్లు. .ఆమె!

ఐనా అనవసరపు ప్రశ్న! ఆమె చూపులో అర్థం వుంది! నిసరిసనిస్స భావగర్భితం !. .. . . . . .

రమణ నిలువుటద్దంలో తన అందాన్ని చూసుకొని తృప్తి చెందాడు! అనేక రకమైన ఫోజులు పర్యవేక్షిస్తున్నాడు. అపురమైనచోట యింకా మేకప్ చేసుకొన్నాడు. ఇప్పుడు, తను అందంగా కనుపించాలి! ఎంత అందంగా కనుపించితే అంత మంచిది! తన్ను ఆకర్షించిన అమ్మాయిని, తనూ ఆకర్షించొద్దూ! ఆ శక్తి తనకు సహజంగా వుంది! అతను, సరికొత్త నడకతో నడుస్తున్నాడు! మాటిమాటికి సరికొత్త నడకతో పోతున్నాడు! బట్టలు సర్దుకోవటం! వాటివైపు చూసుకోవటం! చిరునవ్వు నవ్వుకోటం......

తన గమ్యస్థానం సమీపించింది! మెరిసే మేడ! తను ఎప్పుడూ రాలేదు అటువైపుకు! మేడ ఎంత అందంగా వుంది! తనకోసం అప్పుడు ఎదురు చూస్తుంటారు కాబల్ను! పరిజనంతో బంధు మిత్రులతో తనకు గొప్పగా స్వాగతం జరుగుతుందేమో!

అంతా నిశ్శబ్దవాతావరణం! దూరాన ఎక్కడో వీణా నాదం తక్కువ శృతిలో వినవస్తుంది! రమణ ఆశాభంగం పొందాడు! నిర్మానుష్యమైన ఆ మేడలో చక్కగా ఏర్పాటు చేసిన సోఫాలు! అతను కూర్చున్నాడు. దేనికోసమో వెదుకుతున్నాడు! మేజామీద 'ప్లాస్టిక్' తో చేసిన బొమ్మలు, గోడకు అక్కడక్కడ మాత్రం వ్రేలాడ వుంచిన 'హాలీవుడ్' తారాల ఫోటోలను డోరుకర్టెను మీదవున్న అల్లిక జిగిబిగిని రమణ చూశాడు! ఎంతోసేపు ఓపిగ్గా కూర్చున్నాడు. లేచిపోతే! ఛీ! ఏమి బాగుంటుంది! పూలచెట్ల నుండి వాసనలు గుప్పిస్తున్నాయి. తేనె విందు కోసం భ్రమరాలు గులాబీల చుట్టూ ఝంకారం చేస్తున్నాయి. . . . . .

"నమస్కారమండీ" అంటూ ప్రవేశించింది ఆమె! అంటే తన 'సన్నజాజి! ఆమె రూపసి అంతా సింపుల్. ఆకాశము నుండి ఒక్కసారి ప్రత్యక్షమయిందిలావుంది. అతను మాట్లాడలేదు. చిరునవ్వు నవ్వాడు. ఆమె చిలిపిగా జవాబు యిచ్చింది నవ్వుతూనే.

"చాలా కష్టపడ్డాను యిక్కడకు రావటానికి! ఎత్తైన కొండలు, లోతైన లోయలు, ముళ్ళ కంచెలు దాటవలసి వచ్చిందనుకోండి. అవన్నీ ఏలా దాటెనో తెలియదు! మీరంటే మాత్రం ముగ్ధుణ్ణయ్యాను. . . . ." అన్నాడు రమణ.

"అలానా" అన్నట్లు సోఫాకు జారిపడి చూసింది! సముద్రపు అలలులావున్న ఆ వయ్యారపు వంకుల జుత్తును, ముత్యాలులావున్న కళ్ళను రమణ చూసుకొంటూ చకితుడయ్యాడు. ఆమె సౌందర్యమూర్తి, నిజ. పేరు తెలియదు! ఎవరో తెలియదు. మరి తనను ఆకర్షిస్తుంది. అందం ఎవరిదైనా అందరనూ ఆకర్షిస్తుంది! రేరాజుఅందానికి'కలువరాజు' ముగ్ధురాలవుతుంది! స్వగతం చెప్పింది.

ఆమె మాట్లాడుతుంది. పెదవులు ఎంత చక్కగా వరుసలు పలుకుతున్నాయి! ఎర్రగా లేత మొగ్గలులావు పెదిమల నడుమ, అప్పు డప్పుడు ముత్యాల వరుసల పళ్ళా తలుక్కు మంటూ దర్శన మిస్తున్నాయి. రమణ ఆమెను చూస్తూ ఆమాటలు వింటుంటే ముగ్ధుడ య్యాడు. ముచ్చట పడ్డాడు.

"మిమ్మల్ని ప్రేమించాను . ." హఠా త్తుగా ప్రేమ సందేశం అందించాడు రమణ' పండు వెన్నెలను చిందుమనుష్యులో ప్రేమించి నట్లు—మిమ్మ, మీపంకుల జుత్తును, ఎర్రని బుగ్గలను, తెల్లని శరీరాన్ని ప్రేమించాను. . ."

"నన్ను ప్రేమించటం అంత తేలికనుకొన్నారా" ఆమె బుస్సుమంటూ లేచింది. రుసరుస లాడు తున్న ముఖం, బుసకొడుతున్న కళ్ళు! కోపంతో కందబారిన ముఖంతో బిగించిన పళ్ళతో ఆమె అందంగా వుంది.

అపును ఆమెను ప్రేమించటం అంత తేలిక పనికాదు! ఆమె సామాన్యురాలుకాదు! ఆమెకు మెరిసే మేడ వుంది! పిలిస్తే పరిచారకులు! అరిస్తే గడగడలాడే పనివారు. రమణ అచేతన మయ్యాడు. ఎంత అవమానం! మెరిసేమేడ తనకు లేకపోవచ్చు! అంత మాత్రం చేత తనను తీసివేస్తుందా!!! తను ఒక్క నిమిషం వుండలేడు.

"మీరు నిజంగా ప్రేమిస్తున్నారా ?. . .'! ఆమె ప్రసన్నమయింది. ఇప్పుడు నవ్వుతుంది. అంతా అయోమయంగావుంది అతనకు ఏమిటి ఈ యక్షప్రశ్నలు! వెన్నెలను విసరే పళ్ళు, అమృ తాన్ని చల్లే కళ్ళు, రమణ మాత్రం ముగ్ధుణ్ని చేశాయి.

"నా ప్రేమను మీరు శంకిస్తున్నారా! అవసర మైతే ఎన్ని అగ్నిపరీక్షలకైనా సంసిద్ధమే! మీ జుట్టులో వుండే అందంకోసం, మీ నవ్వులో వుండే ఆనందంకోసం, ఎంతపనైనా చేస్తాను.." ఒక భారీనవ్వునవ్వి తృప్తిచెందింది!! "ఐతే వినండి! నామొదటి కోరిక! సాయంత్రంలోపున నానోట్సులు వ్రాయించి యివ్వాలి. . .మీ ప్రేమ కది—ఒక పరీక్ష. . ."ఆమె ముక్కుసూటిగా చూసి ముచ్చటగా అంది! ముఖం ఎర్రనైంది.

రమణ ఒక చిటికేసి 'ఓహో' అన్నాడు. ఇది కూడా ఒక పరీక్షయేనా! నిమిషాలమీద నోట్సు తేగలడు! కొన్ని తనవద్దే సిద్ధంగా వున్నాయి. తనవద్ద భద్రయ్య అనే యంత్రం వంటి మనిషి వున్నాడు. అతను తల్చుకొంటే నిమిషానికి వంద నోట్సులు వ్రాయగలడు.

పకపక మంటూ బయటికి నడిచాడు రమణ! టకటుకమని మూడుకొట్టేసరికి గడగడలాడుతూ తిరిగివచ్చాడు అతను "ఇదిగో చూసుకోండి!" పిడుగంత కట్టవిసిరాడు, ఆమె ముఖం మీద. ఆమెకు చిరుకోపం వచ్చింది. ఆమె బలం చచ్చింది. అతని ముఖం నచ్చింది.

"మరి రెండోది! ఆ తేనెతెట్టుమీద తేనెటీగలు కొట్టి తేన పట్టి యివ్వండి. వంతొక్షి



పూలు కోస్తున్నా... — ఎ. వి. వి. నరసింగరావు

స్తాను. ." ఆమె వేలు ఎత్తి చూపింది అటు వైపుకు.

రమణ చూశాడు. తేనెటీగలు తనను కుడ తాయి ముఖంమీద గంట్లుపడతాయి. ఛీ! అతను భయపడడు! చిటారుకొమ్మకు ఎక్కాడు. ఆ మిఠాయి పొట్లంకోసం. "బంయ్" మంటూ లేచాయి తేనెటీగలు. మరి తను శత్రువాయే! కాని అవి కాటువేయలేదు. స్వాగతం చెప్పాయి. చిరు నవ్వు నవ్వాయి. చేతితో అందుకొన్నాడు తేనె తెట్టును. . . . .

ఆమె చకితురాలైంది! చిన్నపోయింది. చలిం చింది. అతని ప్రయత్నం ఫలించింది.

"మరి ఆఖరి పరీక్ష! యిందాక, సముద్రంలో నాకాలిజోడు పోయింది! నాడి నాకు తెచ్చి యివ్వండి"

రమణ పళ్ళు బిగించాడు. కళ్ళు కరిగించాడు. జవ్వున లేచాడు. సముద్రం వైపుకు సముద్రం నవ్వుతుంది తనను చూసి, దాని నవ్వును చూసి తను సముద్రాన్ని అడుగుతాడు తన ప్రేయసి కాళిజోడు యిమ్మని.

"మరి తీసుకో, లోపలికిరా. . ." పిలుస్తు న్నాయి అలలు. జోడు కనుపించుతుంది—అంత దూరాన అలలతో ఆడుకుంటూ! అతను నడి చాడు. దాన్ని అందుకోవాలి. ఆమె కందించాలి. అరే! అలల వలయం తనను చుట్టు ముడు తున్నాయి! తెల్లని నురుగు పెదవులకు తగిలి చప్పగా వుంది. ఆ! కాళిజోడు చేతికి చిక్కేంత దగ్గరగా వచ్చింది. కాని కొండంత అల. అడ్డం తనమీదకే! అబ్బో తను మునిగి పోతాడేమో! 'ఢప్' మని కొట్టింది బలమైన అల తలమీద! 'అమ్మా' అంటూ అరిచాడు రమణ!

• • •

"అపహోయ్ నీ మూలుగు. . ." అన్నాడు మూర్తి.

"ఆఁ నేనెక్కడున్నాను. . ." ఆశ్చర్యంగా చూశాడు రమణ.

"ఎక్కడనా! నా సమీపమునందు. నీ జాతకి పాటోముందు. మన హాస్టలు రూమునందు. ఛీ! ఛీ! ఇంకా రెండు గంటల్లో పరీక్షను పెట్టుకొని మొద్దునిద్దుర పోతున్నావు" రమణను మూర్తి చెయ్యిపట్టుకొని లాగేడు.

"ఐతే! యిదంతాకలలో గలటాఅనమాట అరె ఎంత మోసం!" ఒక నిట్టూర్పు విడిచాడురమణ

"కలనిజమవులేరా నాన్నా. . . . ." చెప్పి నట్లు ఆలారం గంట కొట్టింది.

★